క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



సాయి కుటుంబీకులకు ఆర్థిక సాయం చేస్తున్న ఆఖండ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

నాతవరం : రోడ్డు ప్రమాదంలో మృతుడి కుటుంబానికి అఖండ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు బి.శివ ఆర్థిక సాయం అందజేశారు. ఎం.బి.పట్నం గ్రామానికి చెందిన అనపర్తి సాయి గత నెల 24వ తేదీన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి, వైజాగ్‌లో వైద్యం పొందుతూ గత నెల 30వ తేదీన మరణించాడు. అతని కుటుంబానికి ఆఖండ స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు బుధవారం ఎం.బి.పట్నంలో రూ.27వేలు నగదు అందజేశారు. సమితి నిర్వాహకుడు శివతో పాటు రఘు, దయాకర్, చైతన్య, సురేష్ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా సాయి ప్రసాద్



ఆకుల బి.వి.ఎస్ సాయి ప్రసాద్

మాడుగుల : మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా కె. కోటపాడు మండలం చౌడువాడ గ్రామానికి చెందిన ఆకుల బి.వి.ఎస్ సాయిప్రసాద్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం సాయంకాలం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సాయి ప్రసాద్‌ను నియమించారు. దీంతో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఆయనను అభినందించారు.

క్రీడా సామగ్రి వితరణ

మాకవరపాలెం : స్థానిక ఉన్నత పాఠశాల చైర్మన్ ఎల్.మాధవి రూ.10,000 సొంత నిధులతో సమకూర్చిన క్రీడా సామగ్రిని బుధవారం హెచ్‌ఎం నారాయణరావుకు అందజేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు డి.రవి, కె.చంద్రావతి పాల్గొన్నారు.

నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

నర్సీపట్నం : శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన ఆలయ కమిటీ పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ చైర్మన్‌గా వ్యవస్థాపకుడు తాడికొండ బ్రహ్మలింగేశ్వరస్వామితో పాటు సభ్యులుగా పి.ఉదయ శివకుమార్, బి.లక్ష్మి, ఎం.సుజాత, పి.జగదీశ్వరి, కె.వరలక్ష్మి, ఆర్.వరలక్ష్మి, ఆర్.వెంకటరమణ, ఎ.వాసురాజు, అర్చకులు టి.శరత్ ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నియమితులయ్యారు. వారితో ఆలయ ఈవో సాంబశివ, కౌన్సిలర్ రాజేష్ ప్రమాణస్వీకారం చేయించారు.

విద్యుత్ వైర్లకు మరమ్మతులు

గొలుగొండ : ఏఎల్‌పురం పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న కాలనీ ప్రజలకు విద్యుత్‌వైర్లు ప్రమాధాల నుండి మోక్షం కలిగింది. ఎంపీపీ జగ్గలపు మణికుమారి ఈ విద్యుత్ వైర్ల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఏఈ రాజేంద్రకుమార్ చర్యలు తీసుకొని బుధవారం వాహనాల సహాయంతో వేలాడి ఉన్న విద్యుత్ వైర్లు సరి చేయించారు. కొన్నిచోట్ల కొత్తవైర్లు వేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మాడుగుల రూరల్: వరినాట్లు వేసిన తర్వాత సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల చీడపీడలు నివారించవచ్చునని మండల వ్యవసాధికారి ఎం. అనసూయ అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా, ఎం.కోటపాడు, ముకుందపురం గ్రామాల్లో బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. పంట పొలాలు పరిశీలించి వరి పంటకు సస్యరక్షణ చర్యలు సూచించారు. మోతాదుకు మించి ఎరువులు వాడవద్దన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రోలుగుంట: కొవ్వూరులో బుధవారం రోలుగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 48 మంది రోగులకు వైద్యాధికారి మజీదా బేగం చికిత్సలు చేశారు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆమె రోగులకు, గ్రామస్తులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు కలుషితమై ఆ నీటిని తాగడం వల్ల రోగాలొస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో మరగకాచిన నీరు తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని అన్నారు. ఏ విధమైన జ్వర లక్షణాలున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

ధారమఠం రోడ్డులో భక్తులకు కష్టాలు

- అధ్వానంగా మారిన రహదారి
- అడుగడుగునా గోతులతో రాకపోకలకు అవస్థలు



కొత్తపాలెం వద్ద రోడ్డుపై గోతుల్లో చేరిన నీరు



గొలుగొండ చెరువు వద్ద గోతులతో ఉన్న రోడ్డు

గొలుగొండ : ప్రముఖ శైవక్షేత్రమైన దారమఠం వెళ్లే భక్తులకు రోడ్డు సరిగా లేక నరకయాతన పడుతున్నారు. గొలుగొండ నుండి ధారమఠం శివాలయంకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఆరుకిలోమీటర్లు దూరం ఉన్న ఈ రోడ్డు మార్గంలో 20కి చోట్లకు పైగానే రహదారి మధ్య పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీని వల్ల ఈ మార్గంలో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.

నిత్యం రద్దీగా..

గొలుగొండ నుండి ధారమఠం శివాలయం ఆరుకిలోమీటర్లు దూరంలో ఉంది. ఈ మార్గంలో కొత్తపాలెం, ధారపాలెం రెండు గ్రామాలు ఉన్నాయి. భక్తులతో పాటు జలపాతాలను తిలకించడానికి వచ్చే పర్యాటకులతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. వర్షాకాలంలో ధారమఠం వద్ద పలు జలపాతాలు తిలకించడం కోసం ఇతర జిల్లాలను అనేక మంది వస్తుంటారు వర్షం కాలం కావడంతో రోడ్డుపై గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆటో, బైక్ అయితే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని పల సార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

ప్రమాదాలకు నిలయం



ఈ మార్గంలో ప్రయాణం ఇబ్బందిగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని బాగు చేయడం వల్ల అటు పర్యాటకులకు, భక్తులకు ఇబ్బందులు తప్పుతాయి. రహదారిపై గోతుల వల్ల నిత్యం వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ రోడ్డుపై అవగాహన లేక ప్రమాదాలకు గురవుతున్నారు.

–లెక్కల సత్యనారాయణ,
పాతమల్లంపేట మాజీ సర్పంచ్

రైతులకు కూడా ఇబ్బందులు



ధారమఠం దిగువన సుమారుగా 3వేల ఎకరాల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయి. ఈ మార్గంలో వెళ్లే వ్యవసాయం చేసుకోవాలి. ట్రాక్టర్లు, కూలీలు తీసుకువెళ్లే సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. పండిన పంట తీసుకువచ్చే సమయంలో వాహనాలు ప్రమాదాలకు గురి అవుతున్నాయి. కొత్తపాలెం, ధారపాలెం గ్రామస్తులతో పాటు పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు బాగు చేయాలని కోరుతున్నాం

–నారాయణమూర్తి, రైతు, గొలుగొండ

మహిళా చట్టాలు శక్తివంతమైన ఆయుధాలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు

నర్సీపట్నం : మహిళా చట్టాలు శక్తిమంతమైన ఆయుధాలని, ప్రతి మహిళకు గౌరవంగా, భద్రంగా జీవించే హక్కు ఉందని నర్సీపట్నం టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్లో మహిళా భద్రత సామాజిక స్పృహ పెంపుపై బుధవారం, విద్యార్థినులు, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలను వాడేటప్పుడు వ్యక్తిగత ఫొటోలు, ఇతర వివరాలపై జాగ్రత్తలు పాటించాలన్నారు. భద్రత విషయంలో శక్తి యాప్ కవచంలా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. శక్తి వారియర్ టీమ్స్ ప్రత్యేకంగా పని చేస్తున్నాయన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగంపై కలిగే అనర్థాలను తెలుసుకోవాలన్నారు.

ఆకయితాలపై డ్రోన్ నిఘా



డ్రోన్‌తో ఆర్టీసీ పరిసరాలను పర్యవేక్షిస్తున్న సీఐ గోవిందరావు

నర్సీపట్నం : ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆగతాయిల ఆట కట్టేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో డ్రోన్ నిఘా పెట్టామని టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ అవరణలో సిబ్బందితో కలిసి డ్రోన్ ఎగురవేసి పర్యవేక్షించారు. అల్లరి చిల్లరగా తిరుగుతున్న కొంతమంది యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి మందలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు విడిచి పెట్టినప్పుడు ఒక్కసారిగా విద్యార్థులంతా కాంప్లెక్స్‌కు వస్తున్నారని, ఈ సమయంలో విద్యార్థులకు ఆకతాయిల వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి రోజు డ్రోన్ నిఘా కొనసాగుతుందని సీఐ తెలిపారు. విద్యార్థినుల పట్ల ఎవరైన అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జోరు వానలు...పొంగుతున్న వాగులు

- రహదారులు ఏరులు
- మునుగుతున్న పంటలు
- జనజీవనం అస్తవ్యస్తం



వడ్డాదిలో పెద్దేరునదిపై ఉన్న డైవర్షన్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



బుచ్చెయ్యపేటలో లోతట్టు ప్రాంతాల్లో నీట మునుగుతున్న వరి పొలాలు



వర్షంతో వడ్డాది జంక్షన్‌లో బ్యాంకు వద్ద బురద మయంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

బుచ్చెయ్యపేట : మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో రోజువారి కూలీలతో పాటు విధులకు హాజరయ్యే ఉద్యోగులు, స్కూల్, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడ్డాదిలో పెద్దేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డుపై నుండి వరదనీరు ప్రవహించగా తాచేరు, బొడ్డేరు, గుర్రపుగెడ్డ ముఖ్య నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. విజయరామరాజుపేట, పోలేపల్లి, వడ్డాది, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, మంగళాపురం, లూలూరు, కుముదాంపేట తదితర గ్రామాల్లో వరి, చెరకు, మినుము, పెసర, నువ్వు తదితర పంటలతో పాటు పలు రకాల కూరగాయ పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం కలిగింది. ప్రతి రోజూ వర్షం కురవడంతో ఏ రోజు కూలీ ఆ రోజు తెచ్చి కడుపు నింపుకునే రోజువారీ కూలీలు పనులు లేక పస్తులుంటున్నారు. పలువురు తడిచి ముద్దయి తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షంతో గోతుల్లో నీరు చేరి భీమునిపట్నం, నర్సీపట్నం రోడ్డు, రాజాం, తట్టబంద రోడ్డు, పెదమదీన, గున్నెంపూడి రోడ్డు, పెదమదీన, చింతపాక రోడ్లు బురదమయంగా మారడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షంతో ఆవులు,మేకలు,గొర్రెలు ఇతర మూగ జీవాలు తడిచిపోయి పశుగ్రాసం కోసం ఇబ్బందులు పడుతున్నాయి. పలువురు రైతుల పశువుల పాకలు తడిచిపోయి బురదగా మారడంతో మూగ జీవాలను కట్టుకునేందుకు అవస్థలు పడుతున్నారు. పది రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఆరుబయట తిరగక వ్యాపారులకు బేరాలు లేక ఖాళీగా ఉంటున్నామని, వ్యాపార లావాదేవీలు సాగక షాపు అద్దెలు, కరెంట్ బిల్లులు చెల్లింపులకు ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు.

ఎంపీపీ పాఠశాలకు నగదు వితరణ

రోలుగుంట : వెలంకాయలపాలెం ఎంపీపీ పాఠశాలకు గ్రామానికి చెందిన మేకల మహేంద్ర ఫ్యాన్ ఏర్పాటు కోసం రూ.5000 సొంత నిధులను హెచ్‌ఎం బండారు నాని, చంద్రశేఖర్‌కు అందజేశారు.

యూరియా లేక ఇబ్బందులు



ఇటీవల వేసిన వరి పంట

మాడుగుల రూరల్ : ఖరీఫ్ వరినాట్లు వేయడం పూర్తయినా పంటకు ఎరువులు మాత్రం అందలేదని రైతులు వాపోతున్నారు. మండలంలో సుమారు 11000 ఎకరాల భూమిలో వరినాట్లు పూర్తయ్యాయి. వరి నాట్లు వేసిన వారం రోజులు వ్యవధిలో ఎరువులు తప్పనిసరిగా వేయాలి. అయితే రైతు సేవా కేంద్రాలను ప్రైవేటు ఎరువుల షాపుల్లో కూడా యూరియా లేక పోవడం వల్ల రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత నెల మెదటి వారంలో మండల వ్యవసాయ శాఖ ద్వారా రైతు సేవా కేంద్రాలకు 138 టన్నుల యూరియా ఎరువులు పంపిణీ చేశారు. తర్వాత కనీసం కొనుగోలు చేస్తామన్నా యూరియా లేదు. సహకార సంఘాల ద్వారా 48 టన్నుల యూరియా విక్రయించారని మండల వ్యవసాయాధికారి ఎం.అనసూయ బుధవారం తెలిపారు. ప్రస్తుతం 148 టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాలకు పంపించాలని ప్రతిపాదనలు పంపించారు. అయితే 40 టన్నుల యూరియా మరో రెండు మూడు రోజుల వ్యవధిలో రైతు సేవా కేంద్రాలకు వస్తుందన్నారు. గతంలో రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా ఎరువులు సక్రమంగా విక్రయించకపోవడం వల్ల యూరియా కొరత వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఇక నుంచి ప్రతి రైతుకు ఒక యూరియా బస్తా చొప్పున విక్రయించేట్టు వీఏఏలు, వీహెచ్ఏలకు మండల వ్యవసాయాధికారి సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

రసాయన రహిత సాగే లక్ష్యం



మాట్లాడుతున్న ఏవో అప్పారావు

మాకవరపాలెం : రసాయన రహిత పంటల సాగే ప్రకృతి సేద్య లక్ష్యమని ఏవో అప్పారావు అన్నారు. తామరం రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులతో కాకుండా ప్రకృతిలో లభించే ఔషధాలతో పంటల సాగు చేయడంపై అవగాహన కల్పించారు. ఖర్చు ఆదా కావడంతో పాటు ఆరోగ్యకరమైన పంట పొందవచ్చన్నారు. ప్రకృతి సాగులో సహజ సిద్ధంగా లభించే ఎరువులు, ఔషధాల తయారీపై మండల ఇన్‌చార్జి కవిత, సుదర్శన్ రైతులకు శిక్షణ ఇచ్చారు. ఏఈవో శేషునాయుడు, సర్పంచ్ గొంతిన చెల్లారత్నం, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



విద్యార్థులకు వివరిస్తున్న శివనాగేశ్వరరావు

దేవరాపల్లి : మూఢ నమ్మకాలను వీడి సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్ కమిటీ స్టేట్ కన్వీనర్ ఆర్.శివనాగేశ్వరరావు సూచించారు. స్థానిక కైరళీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో లో కాస్ట్, నో కాస్ట్ సైన్స్ ప్రయోగాల వర్క్ షాప్‌ను బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్‌పై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె.త్రిమూర్తులురెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



ఏడీఏ టి.శ్రీదేవి

నర్సీపట్నం : ఎరువులను బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం ఏడీఏ టి.శ్రీదేవి హెచ్చరించారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చినా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్ డివిజన్ పరిధిలో వరి పంట 10765 హెక్టార్లు. చెరకు 940 హెక్టార్లలో సాగు చేస్తున్నారన్నారు. పంటల విస్తీర్ణం బట్టి అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రస్తుతం 166 టన్ను ల యూరియా అందుబాటులో ఉందని, రాబోయే రోజుల్లో పంటలకు అవసరమయ్యే ఎరువులను అంచెలంచెలుగా రైతు సేవ కేంద్రాలు, పీఏసీఎస్‌లు, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ-పంట ఆధారంగా పంట విస్తీర్ణం పంట దశలను బట్టి ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

బీఎన్ రోడ్డులో దెబ్బతిన్న మదుము



శింగవరం వద్ద రోడ్డు మధ్యన మదుముకు రంధ్రం

బుచ్చెయ్యపేట : లోపూడి,శింగవరం గ్రామాల మధ్యన ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఉన్న మదుం మధ్య పెద్ద గొయ్యి పడి బుధవారం సాయంత్రం కూలిపోయింది. ఇప్పటికే ఇదే రోడ్డులో వడ్డాదిలో పెద్దేరు వంతెన, విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెన కూలిపోగా ఇపుడు శింగవరం వద్ద మదుం కూలడంతో వాహనదారులకు మరింత కష్టాలు ఎదురైయ్యాయి. ఈ రోడ్డులో రాత్రిపూట 40 నుండి 70 టన్నుల బరువున్న గ్రానైట్ లారీలు వెళ్ల డం వల్లే శిథిలావస్థలో మదుంలు కూలిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

వేడుకగా అన్న సమారాధనలు



వీరవల్లి అగ్రహారం వీరాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన



ఎం.కోడూరులో వినాయకుడిని దర్శించుకుంటున్న ఏఎస్ఐ సత్యనారాయణ తదితరులు




అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న కమిటీ సభ్యులు

మాడుగుల రూరల్ : మండలంలో ఎం. కోడూరు, వీరవల్లి అగ్రహారం, కె.జె.పురం తదితర గ్రామాల్లో వినాయక మండపాల వద్ద అన్నసమారాధనలు జరిపారు. ఎం.కోడూరు రాజవీధిలో దిల్‌బాయ్స్ ఆధ్వర్యంలో బుధవారం భారీగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారిని ఏఎస్ఐ పి.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, అప్పాన నాయుడు, అప్పాన వెంకటరమణ, కొల్లు గణేశ్, మజ్జి గణేష్ పాల్గొన్నారు. వీరవల్లి అగ్రహారం వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద జరుగుతున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధనలు జరిపారు.


కె.కోటపాడు : మేజర్ పంచాయతీ చౌడువాడలో గల సంపత్ వినాయక ఆలయం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన జరిపారు. చౌడువాడ గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి సుమారు 4వేల మంది భక్తులు హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు దాట్ల అప్పలరాజు, ర్యాలీ సూర్యనారాయణ, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండల కేంద్రంలోని రాజారావుపేట, లాలం వారి వీధిలో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఫ్రెండ్స్ రాజారావుపేట యూత్, లాలం వారి వీధిలో శ్రీలక్ష్మీగణపతి యూత్ ఆధ్వర్యంలో బుధవారం అన్న సమారాధనలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించారు.

రావికమతం : మత్స్యవానిపాలెం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిపారు. గ్రామంలో వరసిద్ధి వినాయక నిమజ్జనం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆంజనేయస్వామి ఆలయం దగ్గరలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రాజారావుపేటలో అన్నసమారాధన



మత్స్యవానిపాలెంలో అన్నసమారాధన

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న



వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : అన్ని దానాల కంటే అన్నదానం మహోత్తరమని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి రామాలయం వీధిలో బుధవారం రాత్రి జరిగిన వినాయక నవరాత్రి మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. వినాయకుడిని దర్శించుకొని పూజలు జరిపారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఐక్యతగా వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసిన స్థానిక యూత్ సభ్యులను, స్థానిక ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, ఏ కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వరదపురెడ్డి లలితానాయుడు, గండిపడాల అప్పలరాజు, కె.వి.రమణ, చొక్కాకుల రమణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలలో విజేతలకు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నాతవరం : పాత వీధిలో భక్తులు వినాయక చవితి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమ వద్ద ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామపెద్దలు ప్రోత్సాహక బహుమతులు, షీల్డు అందజేశారు. నాతవరం శెట్టివారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద అన్నదానం జరిపారు.

చిన్నారులకు టీకాలు

కె.కోటపాడు : 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా వారి తల్లిదండ్రులు వ్యాదినిరోధక టీకాలను వేయించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. ఆర్.వై.అగ్రహారంలో బుధవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. 14 మంది చిన్నారులకు టీకాలతో పాటు ఆరుగురు గర్భిణులకు ధనుర్వాతం టీకాలు వేశారు.

ఈక్రాప్ నమోదు చేసుకోండి

రోలుగుంట : మండల వ్యవసాయశాఖ ఈ–క్రాప్ నమోదు కార్యక్రమం చేపట్టిందని, రైతులందరూ త్వరితగతిన నమోదు చేయించుకుని ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని మండల వ్యవసాయాధికారి సిహెచ్. చిరంజీవి కోరారు. తన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు తమ పంటలను ఈ క్రాప్ చేయించుకుంటేనే బ్యాంకుల్లో రుణాలు మంజూరు అవుతాయన్నారు.